
ఇసుక కష్టాలు తీరినట్టే..!

- 20 మండలాల్లో 44 రీచ్‌ల గుర్తింపు



చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 25 : జిల్లాలో ఇసుక కొరతను తీర్చేందుకు జిల్లాస్థాయి కమిటీ చేసిన కృషి ఫలించింది. ఇటీవల అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో పక్క రాష్ట్రాలు, జిల్లాల నుంచి వాగుల్లో, వంకల్లో నీటి ప్రవాహంతో పాటు ఇసుక చేరింది.దీనిపై దృష్టి సారించిన జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారులు 20 మండలాల్లో 44 ఇసుక రీచ్‌లను గుర్తించారు.నగరి మండలంలో సత్రవాడ, ఏకాంబరకుప్పం, తరణి, పూతలపట్టులో వావిల్‌తోట, వేపనపల్లి, తవణంపల్లిలో నత్తపచేను, ఉత్తర బ్రాహ్మణపల్లి, తవణంపల్లి, గాజులపల్లి, ఐరాలలో పుణ్యసముద్రం, పట్నం, పుల్లూరు, యాదమరిలో పెరియంబాడి, చిత్తూరులో బీఎన్‌ఆర్‌పేట, అనంతాపురం, ఆనగల్లు, ముట్టుకూరు, జీడీనెల్లూరులో మూర్తినారాయణపల్లి, ముక్కళత్తూరు, గొల్లపల్లి, కొత్రకోన, పెనుమూరులో సన్యాసిపల్లి, కలవకుంట, చౌడేపల్లిలో గార్గేయ నది, ఎ.కొత్రకోన, గంగవరంలో నిడిగుంట వద్దనున్న కౌండిన్య నది వంక, గుడుపల్లిలో అగ్రారం ట్యాంక్, కుప్పంలో అడవిబూదుగూరు, బైరుగానిపల్లి, పెద్దబంగారునత్తం, చంద్రం, పలమనేరులో కౌండిన్య నది, పెద్దపంజాణిలో కొగిలేరు, కౌండిన్య, నాగిరెడ్డిపల్లి ట్యాంక్, పుంగనూరులో లద్దిగం చెరువు, ఇటికనెల్లూరు, చెదళ్ల, రామకుప్పంలో వీర్నమల, శాంతిపురంలో పాలారు నది, సదుంలో గార్గేయనది, సోమలలో పెద్దఉప్పరపల్లి, నంజంపేట, వి.కోటలో కొంగాటం చెరువు ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లను గుర్తించారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట

ఇసుక మండలం, జిల్లా నుంచి బయట ప్రాంతాలకు, పక్క రాష్ట్రాలకు తరలిపోకుండా గనుల శాఖ అధికారులు అడ్డుకట్ట వేశారు.వీటిపై మండల స్థాయిలో తహసీల్దారుకు పూర్తి అధికారాలు ఉంటాయి. ఇసుక అక్రమంగా తరలించినట్లు, అధిక ధరలకు విక్రయించినట్లు, ఎక్కడైనా ఎక్కువగా స్టాక్ నిల్వ చేసినట్లు సమాచారం వస్తే వారిపై తహసీల్దారుకు చర్యలు తీసుకునే అధికారముంటుంది. రీచ్ నుంచి ఇసుక తీసుకునేందుకు గ్రామ, వార్డు సచివాలయాల్లోని వార్డు కార్యదర్శుల వద్ద ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. రోజుకు ఎన్ని ట్రాక్టర్ల ఇసుక ఏ రీచ్ నుంచి ఎక్కడికి వెళుతుందనే వివరాలు వార్డు కార్యదర్శులే నమోదు చేయాల్సి ఉంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

జిల్లాలో ఇసుక కొరత ఉండడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పలు రీచ్‌లు గుర్తించాం. ఇసుక రవాణాకు పలు నిబంధనలు, షరతులు విధించాం. మండల స్థాయిలో తహసీల్దార్లకు పూర్తి అధికారాలుంటాయి. ఆన్‌లైన్ ద్వారానే ఇసుక బుకింగ్ చేసుకోవాలి. నిబంధనలు ఉల్లంఘించి అక్రమ రవాణా చేసేవారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటాం.


- ప్రసాద్, గనులు, భూగర్భ శాఖ డీడీ

ఇసుక సేకరణకు షరతులు

గుర్తించిన రీచ్‌ల నుంచి ఇసుకను తీసుకునేందుకు జిల్లాస్థాయి కమిటీ పలు షరతులు విధించింది. ఇసుకను కేవలం ట్రాక్టర్ల ద్వారానే తీసుకుపోవాలి. ఇసుక లోడింగ్‌లో ఎలాంటి యంత్రాలు ఉపయోగించరాదు. కేవలం కూలీల సాయంతోనే ఇసుకను ట్రాక్టర్‌లో లోడ్ చేయాలి. ఇసుక తీసుకునేందుకు గ్రామ, వార్డు సచివాలయాల్లో అనుమతి అవసరం. అధికారులు ఆమోదించిన ట్రాక్టర్లలోనే ఇసుక తరలించాల్సి ఉంది. కేవలం గృహ నిర్మాణాలకు, ప్రభుత్వం చేపట్టే నిర్మాణాలకు మాత్రమే అనుమతి ఉంది.

ఎక్సైజ్ డీసీగా విజయశేఖర్

- తిరుపతి,చిత్తూరు ఈఎస్‌లుగా నాగమల్లేశ్వర రెడ్డి, శ్రీనివాస్



విజయశేఖర్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 25:ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న టి. విజయశేఖర్ నియమితులయ్యారు. చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్‌గా తిరుపతి జిల్లాలోని డిస్టలరీ యూనిట్‌లో పనిచేసిన శ్రీనివాసాచారి,తిరుపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నెల్లూరులో పనిచేస్తున్న నాగమల్లేశ్వర రెడ్డి,తిరుపతి డిస్టిలరీ అసిస్టెంట్ కమిషనర్‌గా అనంతపురం జిల్లాలో విజిలెన్సు విభాగంలో పనిచేస్తున్న ఎస్.బాలకృష్ణ, చిత్తూరు ఈఎస్‌గా తిరుపతి సెబ్‌లో ఈఎస్‌గా పనిచేసిన శ్రీనివాస్ బదిలీ అయ్యారు.తిరుపతిలో ఈఎస్‌గా పనిచేసిన జానకిరాం ఏపీ బ్రూవలరీ కార్పొరేషన్‌కు డిపో మేనేజర్‌గా బదిలీ అయ్యారు. చిత్తూరులో ఈఎస్‌గా పనిచేసిన షేక్ ఆయేషాబేగం బ్రూవరేజ్ యూనిట్‌కు డిపో మేనేజర్‌గా బదిలీ అయ్యారు.వీరంతా త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.గతంలో వైసీపీ ప్రభుత్వం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను సెబ్(స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో), ఎక్సైజ్ పేరుతో రెండు భాగాలుగా విభజించిన విషయం తెలిసిందే. అప్పటి ఎక్సైజ్ సిబ్బందిలో 70 శాతం సెబ్‌కు, 30 శాతం ప్రొహిబిషన్, ఎక్సైజ్‌కు కేటాయించింది. సెబ్‌ను ఏర్పాటు చేసినపుడు డీసీ, ఏసీ పోస్టులను తీసివేసి జిల్లాకు ఒక అధికారిని మాత్రమే నియమించింది.కూటమి ప్రభుత్వం వచ్చాక సెబ్‌ను రద్దు చేసింది.ఎక్సైజ్ శాఖలో గతంలో ఉన్న డీసీ, ఏసీ పోస్టులను తిరిగి ఏర్పాటు చేసింది.



అన్ సీజన్‌లో విరగ్గాసింది !

వేసవికాలం అనగానే మనందరికీ ఠక్కున గుర్తుకొచ్చేది మామిడిపండ్లు.అయితే అన్ సీజన్‌లో ఈ మామిడితోట పూత, పిందెలతో కళకళలాడుతోంది.పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కోటపల్లి సమీపంలోని మనోహర్‌కు చెందిన ఈ తోటలో మామిడి దిగుబడి ప్రత్యేకత చాటుతోంది. సాధారణంగా డిసెంబర్, జనవరి నెలల్లో మామిడి పూతలు వస్తాయి. వేసవికాలంలో పూర్తిస్థాయి పంట దిగుబడి వస్తుంది.అటవీ ప్రాంతానికి సమీపంలో మనోహర్‌కు చెందిన రెండెకరాల్లో వంద మామిడిచెట్లున్నాయి.ఈ ఏడాది సీజన్‌కు ముందే పూత రావడంతో రెండు పర్యాయాలు మందులు పిచికారి చేశాడు. దీంతో పూత, పిందెలు, కాయలతో చెట్లు కళకళలాడుతున్నాయి.అకాల వర్షం, ఈదురుగాలులు రాకపోతే సుమారు 4 నుంచి 5 టన్నులు కాయలు దిగుబడి వచ్చే అవకాశముందని, ధరలు కూడా బాగుంటాయని మనోహర్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు.

- కల్లూరు

ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐల సస్పెన్షన్

- తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల కేసుల్లో తాజా పరిణామం



దేవేంద్రకుమార్



అబ్బన్న

తిరుపతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి లోక్‌సభ స్థానానికి 2021 మార్చిలో జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా తిరుపతిలో దొంగ ఓటర్లపై నమోదైన కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలు తాజాగా సస్పెండయ్యారు. వీరిలో తిరుపతిలోని అలిపిరి సీఐలుగా పనిచేసిన దేవేంద్రకుమార్, అబ్బన్న వుండగా ఎస్‌ఐలలో తిరుపతి ఈస్ట్ స్టేషన్ ఎస్‌ఐగా పనిచేసిన నాగేంద్ర బాబు, ఎస్వీయూ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా పనిచేసిన సుమతి వున్నారు. 2021 మార్చిలో జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా అలిపిరి పోలీసు స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ అభ్యర్థి పనబాక లక్ష్మి, బీజేపీ నేత శాంతారెడ్డి పలువురు దొంగ ఓటర్లను పట్టుకుని అలిపిరి స్టేషన్‌లో అప్పగించారు. దీనిపై అప్పటి సీఐ దేవేంద్రకుమార్ క్రైమ్ నంబర్లు 217-2021, 218-2021 పేరిట రెండు కేసులు నమోదు చేశారు. అయితే సక్రమంగా దర్యాప్తు చేయలేదు. ఆయన సెలవుపై వెళ్లడంతో ఆ స్థానంలో సీఐగా వచ్చిన అబ్బన్న కూడా సక్రమంగా దర్యాప్తు చేయలేదు. దొంగ ఓటర్లను విచారించడం గానీ, సీసీ ఫుటేజీలను పరిశీలించడం గానీ, ఆధారాలు సేకరించడం గానీ చేయలేదు. రాజకీయ ఒత్తిళ్లతో కేసులు రెండూ మూసివేశారు. ఎన్నికల కమిషన్ గత ఫిబ్రవరిలో ఈ కేసులను తిరగదోడి విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈసీ ఆదేశాలతో జరిగిన విచారణలో వీరి నిర్లక్ష్యం నిర్ధారణ కావడంతో తాజాగా ఉన్నతాధికారులు వీరిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు సమాచారం. అలాగే ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డీబీఆర్ రోడ్డులో దొంగ ఓటర్లు బస్సులో వచ్చి ఓట్లు వేస్తున్నారని అప్పటి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి చేసిన ఫిర్యాదుతో అప్పటి ఈస్ట్ స్టేషన్ ఎస్‌ఐ నాగేంద్ర బాబు క్రైమ్ నంబరు 180-2021 పేరిట కేసు నమోదు చేశారు.అయితే దర్యాప్తు చేయకుండా కేసును నీరుగార్చేందకు యత్నించారు. తర్వాత బదిలీపై ఎమ్మార్‌పల్లి వెళ్లిన ఆయన పది రోజుల క్రితం ఈస్ట్ స్టేషన్‌కు వచ్చారు. ఇపుడు సస్పెండ్ అయ్యారు.

అదే విధంగా ఎస్వీయూ స్టేషన్ పరిధిలో దొంగ ఓటర్లు వ్యానులో వచ్చి ఓట్లు వేస్తున్నారని నాటి మున్సిపల్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి చేసిన ఫిర్యాదుతో యూనివర్శిటీ స్టేషన్‌లో క్రైమ్ నంబరు 65-2021 పేరిట కేసు నమోదయ్యింది. అయితే దర్యాప్తులో అప్పటి ఎస్‌ఐ సుమతి నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఈసీ ఆదేశాలతో జరిపిన విచారణలో తేలడంతో తాజాగా ఆమెపై సస్పెన్షన్ వేటు పడింది.ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐల సస్పెన్షన్ గురించి జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పీ వెంకట్రావును వివరణ కోరగా ఆయన ధృవీకరించారు.



కొడిదిపల్లి సమీపంలో చిరుత కలకలం

కల్లూరు, సెప్టెంబర్ 25: పులిచెర్ల మండలం 102 రామిరెడ్డిగారిపల్లి పంచాయతీ కొడిదిపల్లి సమీపంలో బుధవారం సాయంత్రం చిరుత పులి సంచారం కలకలం రేపింది. బుధవారం సాయంత్రం 5:30 గంటల సమయంలో ధర్మవరం నుంచి నరసాపూర్‌కు ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్లాల్సి వుండడంతో కొడిదిపల్లి వద్ద గేట్‌మాన్ బాలాజి రైల్వేగేట్ మూశాడు. అదే సమయంలో పట్టాలను చిరుత పులి దాటుతుండడాన్ని గమనించాడు. వెంటనే తన మొబైల్‌లో చిరుత సంచార దృశ్యాలను వీడియో తీశాడు. గ్రామానికి చెందిన బాలకృష్ణమరాజు మామిడితోటలోకి చిరుత వెళ్లే దృశ్యాలను వీడియో తీసి స్థానిక ప్రజలను అప్రమత్తం చేశాడు.

కల్పవృక్ష వాహనంపై పార్వతీ తనయుడు

ఐరాల(కాణిపాకం),సెప్టెంబరు 25 : కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో బుధవారం రాత్రి కల్పవృక్ష వాహనంపై వినాయకస్వామి విహరించారు.ఆలయ ఈవో, అర్చక, వేదపండితులు, సిబ్బంది ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం మూల విరాట్‌కు పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం పాల కలశాలను తలపై పెట్టుకొని కాణిపాక పురవీధుల్లో ఊరేగించాక కల్యాణ వేదిక వద్ద సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవర్లకు క్షీరాభిషేకం నిర్వహించారు. రాత్రి ఉభయ వరస రావడంతో అణివేటి మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవర్లకు పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కల్పవృక్ష వాహనంపై ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు.ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్, ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు,విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీధరబాబు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్‌రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు పూలంగి సేవ

కాణిపాక ప్రత్యేక ఉత్సవాల్లో గురువారం స్వామివారికి పూలంగి సేవ నిర్వహించనున్నారు. వేలూరుకు చెందిన రాజమాణిక్యం నాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారులు, కాణిపాకానికి చెందిన కె.రాధాకృష్ణన్ ఉభయదారులుగా వ్యవహరిస్తారు.



సిద్ధి,బుద్ధి సమేత వరసిద్దుడి ఉత్సవమూర్తులతో ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి



కల్పవృక్ష వాహన సేవకు హాజరైన భక్తజనం


34 మంది ఎంపీడీవోల బదిలీ

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 25: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 34మంది ఎంపీడీవోలను బదిలీ చేస్తూ జడ్పీ సీఈవో గ్లోరియా ఉత్తర్వులు జారీ చేశారు. రామచంద్రాపురం ఎంపీడీవోగా ఇందిరమ్మ, ఎర్రావారిపాళ్యానికి అరుణ, ఐరాలకు ధనలక్ష్మి, గుడిపాల కు శివరాజు, కురబలకోటకు గంగయ్య, మదనపల్లెకు తాజ్ మస్రూర్, చిత్తూరుకు కె.శ్రీనివాసులు, పిచ్చాటూరుకు మహ్మద్‌రఫీ, కలకడకు అబ్దుల్ రహీం, కార్వేటినగరానికి చంద్రమౌళి, వడమాలపేటకు శేషగిరిరావు, కలికిరికి భానుమూర్తి రావు, తొట్టంబేడుకు సురేంద్రనాథ్, గంగవరానికి సురేష్‌బాబు, కేవీపల్లికి సుధాకర్, పెద్దపంజాణికి కేఎన్ బాలాజి, సోమలకు అబ్దుల్ కలామ్ ఆజాద్, వెదురుకుప్పానికి అమరనాద్, పూతలపట్టుకు నాగరాజు, ములకలచెరువుకు హరినారాయణ, రామసముద్రం ఎంపీడీవోగా భానుప్రసాద్ బదిలీ అయ్యారు.నిమ్మనపల్లె ఎంపీడీవోగా పరమేశ్వర‌రెడ్డి, రొంపిచెర్లకు మధుసూదనరెడ్డి, శాంతిపురానికి ప్రేమ్‌రాజ్‌కుమార్, గుడుపల్లికి లీలా మాధవి, తిరుపతి రూరల్‌కు రామచంద్ర, రేణిగుంటకు రమేష్‌బాబు, చిన్నగొట్టిగల్లుకు గిడ్డయ్య, తంబళ్ళపల్లికి ఉపేంద్రరెడ్డి, పీలేరుకు శివశంకర్, పీటీఎం ఎంపీడీవోగా విష్ణు చిరంజీవి బదిలీ అయ్యారు. నాగలాపురం ఎంపీడీవోగా బాలాజీ నాయక్, ఏర్పేడుకు సౌభాగ్యం, రామకుప్పం ఎంపీడీవోగా లక్ష్మీకాంత్‌లను బదిలీ చేశారు. మిగిలిన 31మండలాల విషయానికి వస్తే 17 మండలాల్లో ఏవోలు, ఈవోఆర్డీలు ఇన్‌చార్జి ఎంపీడీవోలుగా వ్యవహరిస్తున్నారు. 14 మండలాల్లో ఎంపీడీవోలకు అక్కడ ఐదేళ్ల సర్వీసు పూర్తి కాకపోవడంతో వారంతా అక్కడే ఉన్నారు.

ఒకే వారంలో తిరుమలకు ముగ్గురు వీఐపీలు

చంద్రబాబు, పవన్ కల్యాణ్, జగన్ వరుస పర్యటనలు

జగన్, పవన్ కాలినడకన వెళ్ళే అవకాశం







తిరుపతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తోడు తిరుమల లడ్డూ ప్రసాదాల కల్తీ వ్యవహారం నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తిరుపతికి వరుస పర్యటనలు తలపెట్టారు. ఒకరి తర్వాత ఒకరుగా ముగ్గురు కీలక నేతలు పర్యటనకు వస్తుండడంతో భద్రతాపరంగా పోలీసులకు తలనొప్పిగా మారనుంది.శ్రీవారి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4వ తేదీన ప్రారంభం కానుండడంతో తొలిరోజు శ్రీవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించే సాంప్రదాయాన్ని పాటించేందుకు సీఎం చంద్రబాబు అదే రోజున తిరుమల రానున్నారు. ఇక శ్రీవారి లడ్డూ కల్తీ వివాదం నేపథ్యంలో ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం దీక్ష చివరి రోజున తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోనున్నట్లు సమాచారం. ఆయన అక్టోబరు 1వ తేదీన తిరుపతి వచ్చి అలిపిరి కాలినడక మార్గంలో తిరుమల వెళతారని, 2న శ్రీవారిని దర్శించుకుని, 3న తిరుపతిలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక లడ్డూ వివాదంలో ఆరోపణలు, విమర్శలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మాజీ సీఎం వైఎస్ జగన్ ఈనెల 28న తిరుపతి వచ్చి అలిపిరి నడక దారిలో తిరుమల చేరుకుని 29న శ్రీవారిని దర్శించుకుంటారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

పోలీసులకు తలనొప్పిగా మారనున్న భద్రతా ఏర్పాట్లు

సీఎం చంద్రబాబు తిరుపతి నుంచీ రోడ్డు మార్గాన తిరుమల చేరుకుని శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించాక వెనుదిరగనున్నారు. సీఎం పర్యటనకు భద్రతా ఏర్పాట్ల పరంగా పోలీసు యంత్రాంగానికి పెద్దగా ఇబ్బందేమీ కనిపించడం లేదు. అయితే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అలిపిరి నడక దారిలో తిరుమల వెళితే మాత్రం దారి పొడవునా బందోబస్తు ఏర్పాటు చేయాల్సి వుంటుంది. ఆయనకున్న జనాకర్షణ కారణంగా దారి పొడవునా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాల్సిందే. తిరుమలలోనూ, చివరి రోజు తిరుపతిలో కూడా ఆయన పర్యటనకు బందోబస్తు ఏర్పాటు చేయడం పోలీసులకు కఠిన పరీక్ష కానుంది. ఇక మాజీ సీఎం జగన్ పర్యటన అన్నింటికంటే పోలీసు యంత్రాంగానికి అగ్ని పరీక్షగా మారనుంది. ఎందుకంటే శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీకి ఆయనే కారకుడంటూ పలు రాజకీయ పార్టీలు, హిందూ మత సంస్థలూ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన నడక దారిన వెళితే దారిపొడవునా భద్రత ఏర్పాటు చేయడం ఒక సమస్య అయితే ఆయన్ను పలు పార్టీలు, సంఘాలు, సంస్థలూ అడ్డుకునే అవకాశాలున్నాయి. శ్రీవారి ప్రసాదాలను అపవిత్రం చేసిన వారికి తిరుమల వెళ్ళే హక్కు, గానీ, శ్రీవారిని దర్శించుకునే హక్కు గానీ లేదని అభ్యంతరపెట్టే అవకాశముంది. ఆయన్ను అడ్డుకునే యత్నాలు శాంతిభద్రతల సమస్యకూ దారితీసే ప్రమాదముంది. ఆ మేరకు పోలీసు యంత్రాంగం భారీ బలగాలను మొహరించాల్సి వుంటుంది. దీనికి తోడు ముగ్గురు కీలక నేతల పర్యటనలకు విరామం లేకుండా బందోబస్తు విధులు నిర్వర్తించాల్సి వుండడం పోలీసు యంత్రాంగానికి తలనొప్పిగా మారనుంది.

విద్యుత్ శాఖ గ్రీవెన్స్‌డేకి 13 ఫిర్యాదులు



అర్జీలు స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, సెప్టెంబర్ 25: జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన విద్యుత్తు శాఖ గ్రీవెన్స్ డేకు 13 ఫిర్యాదులు వచ్చినట్లు ఆ శాఖ ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ప్రతి బుధవారం ప్రత్యేకంగా వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తాజాగా వచ్చిన అర్జీల్లో ఆరింటిని అప్పటికప్పుడే పరిష్కరించామన్నారు. మిగిలిన ఫిర్యాదులను త్వరలో పరిష్కరిస్తామన్నారు. తిరుపతి టౌన్‌లో 1, చిత్తూరు ఆపరేషన్ 4, చిత్తూరు రూరల్ 1, మదనపల్లి 1, పీలేరు 1, పుంగనూరు 5 ఫిర్యాదులు వచ్చాయన్నారు. అర్జీలను త్వరగా పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ డేపై ఏఈలు, లైన్‌మెన్లు, విద్యుత్తు శాఖ సిబ్బంది విరివిగా ప్రచారం చేయాలన్నారు. చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో ఈఈ మునిచంద్ర అర్జీలు స్వీకరించారు.

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో భారీగా బదిలీలు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 25: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ భారీగా బదిలీలు జరిగాయి. చిత్తూరు జిల్లాలో 112 మంది, అన్నమయ్య జిల్లాలో 60 మంది, తిరుపతి జిల్లాలో 86 మంది బదిలీ అయ్యారు. ఒకే ప్రాంతంలో ఐదేళ్ల పాటు పనిచేసిన వారు 84 మంది బదిలీ అయ్యారు. 174 మంది అభ్యర్థన మేరకు కోరుకున్న ప్రాంతాలకు వెళ్లారు. మండల సమాఖ్య క్లస్టర్ కోఆర్డినేటర్లు 21 మంది, మస్టర్ బుక్ కీపర్లు 40 మంది, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు 118 మంది, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు 76 మంది, ముగ్గురు డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్లు బదిలీ అయ్యారు. ●తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్లను వారి అభ్యర్థనపై బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ● కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయంలో 30మంది సీనియర్ అసిస్టెంట్లు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను వారి వ్యక్తిగత అభ్యర్థనపై బదిలీ చేశారు.

విశ్రాంత అధికారి పెన్షన్‌లో కోత

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 25: విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ పీఎస్ లక్ష్మీవెంకటేశ్వర్లుకు పెన్షన్‌లో ఏడాది కాలం పాటు ఐదు శాతం కోత విధిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన తవణంపల్లె మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని తేలడంతో ఈ చర్యలు తీసుకున్నారు.

ఫైళ్ల నిర్వహణలో అప్రమత్తం : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 25: కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని పలు విభాగాల్లో ఉద్యోగులు సక్రమంగా ఫైళ్ళు నిర్వహించడం లేదని మంగళవారం గుర్తించామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేర పలు సూచనలు చేస్తూ బుధవారం సర్క్యులర్ జారీచేశారు. అక్టోబర్ 5న అన్ని కార్యాలయాల్లో మళ్లీ ఆకస్మిక తనిఖీ చేపడతామన్నారు. ఆఫీసు సూపరింటెండెంట్లు, ఉద్యోగులు ఇకపై అన్ని ఫైళ్ళను పద్ధతి ప్రకారం జవాబుదారీతనంగా ఉంచుకోవాలన్నారు. క్యాబిన్లలో, కార్యాలయ గదుల్లో, ఫైళ్ళ ర్యాక్స్‌లో పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యాలయాల గోడలపై అంటించిన అనవసర పోస్టర్లు, బ్యానర్లు, పెట్టెలు, వాడకంలోలేకుండా వృథాగా పడివున్న ఎలక్ట్రానిక్ వస్తువులు, వీల్‌చైర్లు అక్కడి నుంచి తొలగించాలన్నారు. సూచనలను పాటించకపోతే చర్యలు తీసుకుంటానని కలెక్టర్ ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

రేపిస్టుపై పోక్సో కేసు నమోదు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 25: మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు ....పుంగనూరు మండలంలోని నేతిగుట్లపల్లె పంచాయతీ అక్కింవారిపల్లెకు చెందిన విజయభాస్కర్ ఓ మైనర్ బాలికపై అత్యాచారం చేయడంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష దరఖాస్తులకు గడువుపెంపు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 25: జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి ప్రవేశానికి ఎంపిక పరీక్షలు దరఖాస్తులను గడువును అక్టోబరు 7వ తేదికి పెంచుతున్నట్లు అన్నమయ్య జిల్లా వలసపల్లి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు నవోదయ.జీవోవి.ఇన్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాల్లో మార్పులు చేసేందుకు చివరి తేదీ అక్టోబరు 8, 9వ తేదీలలో అవకాశం ఉందన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

10 మంది సీఐల బదిలీ

● నలుగురు వీఆర్‌కు రిపోర్టు చేసుకోవాలని డీఐజీ ఆదేశాలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 25: అనంతపురం రేంజ్ పరిధిలో దాదాపు 16 మంది సీఐలు బదిలీ కాగా అందులో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన 10 మంది ఉన్నారు. వీరిలో నలుగురిని వీఆర్‌కు పంపుతూ అనంతపురం రేంజ్ డీఐజీ షీమూషీ బుధవారం ఉదయం ఉత్తర్వులు జారీ చేశారు. వీరందరూ తక్షణం రిలీవ్ అయి వారి వారి స్థానాల్లో చేరాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న మునస్వామిని పుత్తూరు రూరల్‌కు, అక్కడున్న ఎం.భాస్కరనాయక్‌ను వీఆర్‌కు, ప్రస్తుతం తిరుపతి వీఆర్‌లో ఉన్న పి.శ్రీరాములను డీటీఆర్‌బీకి, తిరుపతి ట్రాఫిక్‌లో ఉన్న కె.శ్రీనివాసులను తిరుపతి ఈస్ట్ సర్కిల్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న చిన్న పెద్దయ్యను శ్రీసిటీకి, తిరుపతి ఈస్ట్ సీఐ మహేశ్వర రెడ్డిని వీఆర్‌కు, డీటీసీ తిరుపతిలోని ఎ.శ్రీరాముడును తిరుమల టూ టౌన్‌కు, అక్కడున్న సత్యనారాయణను వీఆర్‌కు, చిత్తూరు వీఆర్‌లో ఉన్న కృష్ణమోహన్‌ను పూతలపట్టుకు బదిలీ చేశారు. దీంతో జిల్లాలో సీఐల బదిలీలు దాదాపు పూర్తయ్యాయి.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.45కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 25: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,45,87,352 వచ్చింది. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద హుండీ లెక్కింపు జరిగింది. ప్రధాన హుండీలతో పాటూ పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా 68 గ్రాముల బంగారం, 421.200కిలోల వెండి, విదేశీ కరెన్సీ 3,452 వచ్చింది. 28 రోజుల వ్యవధిలో ఈ ఆదాయం వచ్చినట్టు ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కష్టాలు!

డబ్బు కట్టినా వ్యవసాయ సర్వీసులివ్వరు

ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయినా పట్టించుకోరు

పలమనేరు, సెప్టెంబరు 25 : వ్యవసాయ సర్వీసులకోసం డబ్బులు కట్టి నెలలు గడిచిపోతున్నా పట్టించుకునే దిక్కులేదు. ట్రాన్స్‌ఫార్మర్లకోసం డబ్బులు కట్టి సంవత్సర కాలంగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా స్పందించేవారు లేరు. దీంతో రైతులు ఏమి చేయాలో, తమగోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. పలమనేరు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని పలమనేరు, గంగవరం, బైరెడ్డి పల్లి మండలాల రైతులు వర్షాభావం కారణంగా బోరుబావుల పైనే వ్యవసాయం చేయాల్సి వుంది. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే క్షేత్రస్థాయి సిబ్బందికి ఎంతో కొంత ముట్టజెప్పి రైతులే ఆటోల్లో వాటిని తీసుకెళ్లాల్సి వస్తోంది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా విద్యుత్ స్తంభాలు కూలిపోయినా నెలల తరబడి పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.వ్యవసాయ సర్వీసులు మంజూరై రైతులు డబ్బులు చెల్లించినా మెటీరియల్ లేదన్న సాకులు చెబుతూ విద్యుత్ సిబ్బంది కాలయాపన చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విద్యుత్ స్తంభాలను కూడా కార్యాలయాల వద్ద కాకుండా అధికారులు ఎక్కడ దించితే అక్కడినుంచీ పొలాల వద్దకు వేలాది రూపాయలు వెచ్చించి తరలించుకోవాల్సి వస్తోందని రైతులు విమర్శిస్తున్నారు.

ఏడాదికి పైగా ప్రదక్షిణ

గంగవరం మండలం కలగటూరు గ్రామానికి చెందిన దళిత రైతు సుబ్రమణ్యం వ్యవసాయ సర్వీసు కోసం గత ఏడాది జూన్‌లో రూ. 12400కట్టి దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్నుంచీ వందల సార్లు గంగవరం ఏఈ కార్యాలయం చుట్టూ తిరిగినా వ్యవసాయ సర్వీసు ఇవ్వనేలేదు.ఏఈ నాలుగునెలల క్రితం సస్పెండ్ కావడంతో సుబ్రమణ్యం తన ప్రదక్షిణా కార్యక్రమాన్ని ఏడీఈ కార్యాలయం వద్దకు మార్చాడు.అక్కడికి నాలుగు నెలలుగా తిరుగుతున్నా మెటీరియల్ లేదంటూ తిప్పుతూనే వున్నారు.ఒక విద్యుత్ స్తంభం అవసరముండగా దాన్ని కీలపట్ల గ్రామ సమీపంలో నిల్వవుంచిన స్థలం నుంచి తరలించుకుపొమ్మని చెప్పారు.దీంతో సుబ్రమణ్యం గత్యంతరం లేక విద్యుత్ స్తంభాన్ని 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న కీలపట్లనుంచి కలగటూరుకు ట్రాక్టరుకు బాడుగ ఇచ్చి తరలించాల్సి వచ్చింది.మిగిలిన మెటీరియల్ రాలేదని ఇప్పటికీ తిప్పుతూనే ఉన్నారు.



సుబ్రమణ్యం - సర్వీసుకోసం సుబ్రమణ్యం చెల్లించిన మొత్తానికి విద్యుత్ శాఖ రసీదు

ట్రాన్స్‌ఫార్మర్ కోసం నెలల తరబడి...



రత్నారెడ్డి

పలమనేరుకు 15 కిలో మీటర్ల దూరంలోని నాలుగురోడ్ల వద్ద ఉన్న తన పొలంలో వేసిన బోరు కోసం 15 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని రత్నారెడ్డి దరఖాస్తు చేసుకున్నారు.దాదాపు 8నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కోసం అధికారులు రూ. 18వేలు కట్టించుకున్నారు.నెలల పర్యంతం తిప్పుకొని చివరకు కూర్నిపల్లి సబ్‌స్టేషన్ వద్ద నిల్వవుంచిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తెచ్చుకోమన్నారు.గత్యంతరం లేక ఆటోలో 20కిలోమీటర్ల దూరంలోని కూర్నిపల్లి వద్దకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌ను రత్నారెడ్డి పొలం వద్దకు తెచ్చుకు వెళ్లాడు.ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చి నెలలు గడుస్తున్నా దాన్ని బిగించేందుకు కావాల్సిన మెటీరియల్ స్టాకు లేదని ఇంకా తిప్పుతూనే వున్నారు.



రత్నారెడ్డి ఇంటి వద్ద మూడునెలలుగా పడివున్న ట్రాన్స్‌ఫార్మర్



బాధితులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ప్రభావతి - చికిత్స పొందుతున్న రోగులు

కొత్తగొల్లపల్లెలో అతిసార

● 15 మందికి చికిత్స

తవణంపల్లె, సెప్టెంబరు 25: మండలంలోని నల్లిశెట్టిపల్లె పంచాయతీ కొత్తగొల్లపల్లెలో అతిసార విజృంభించింది. కలుషిత తాగునీరు తాగడంతో పలువురు వాంతులు, విరేచనాలతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మంగళవారం ఐదుగురికి సోకగా బుధవారం మరో పదిమంది ఈ వ్యాధి బారినపడ్డారు. దీంతో జిల్లా వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. వైద్య సిబ్బంది గ్రామానికి చేరుకుని అతిసార నివారణ చర్యలు చేపట్టారు. రక్షిత మంచి నీటి ట్యాంక్ ద్వారా సరఫరా అయ్యే నీరు కలుషితం కావడం వల్ల వ్యాధి ప్రబలినట్లు తెలుస్తోంది. గ్రామానికి చెందిన కన్నయ్య, అమర, చిరంజీవి, శరవణ కుమార్, లిల్లి, అనూష, మునికృష్ణ, రమీలా, మణి, గురవయ్య, భార్గవిలతో పాటు మరికొందరికి వైద్య సిబ్బంది చికిత్స అందిస్తున్నారు. కొత్తగొల్లపల్లెలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి ప్రభావతి, టీకాల అధికారి హనుమంతరావు, మలేరియా అధికారి అనిల్‌కుమార్, డీపీవో లక్ష్మి, శ్రీవాణిలు సందర్శించారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు.

టైక్వాండో పోటీల్లో గంగవరం కేజీబీవీ ప్రతిభ

● అండర్-19లో 6, అండర్-17 లో 3 బంగారు పతకాలు కైవసం



బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు

గంగవరం, సెప్టెంబరు 25: ఉమ్మడి చిత్తూరు జిల్లా టైక్వాండో అండర్-19, అండర్-17 వెయిట్ కేటగిరి పోటీల్లో గంగవరం కేజీబీవీ విద్యార్థినులు 9 బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు ఎస్వో రోహిణి తెలిపారు. బుధవారం తిరుపతిలోని ముత్యాలరెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్‌లో టైక్వాండో అండర్-19, అండర్ -17, అండర్-14 విభాగాల్లో వివిధ వెయిట్ లిఫ్టింగ్ కేటగిరీల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గంగవరం కేజీబీవీ విద్యార్థినులు అండర్-19, అండర్-17 విభాగాల్లో హోరాహోరీగా తలపడ్డారు. ఫైనల్లో గెలుపొందిన గంగవరం విద్యార్థినులు అండర్ -19 విభాగంలో ఇంటర్ సీఈసీ సెకండియర్‌కు చెందిన కీర్తన, యం.జాహ్నవి, ఇంటర్ సీఈసీ ఫస్ట్ ఇయర్‌కు చెందిన కె.మౌనిక, పి.హిమాని, కె.నేత్రావతిలతో పాటు 10వ తరగతికి చెందిన జె.ఎస్. హేమలత బంగారు పతకాలు సాధించారు. అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ కేటగిరీలో 10వ తరగతికి చెందిన ఆర్.చందన, యస్.లక్ష్మీదేవి, 9వ తరగతికి చెందిన ఎం.మాధవి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు.అండర్-19లో ఆరు బంగారు పతకాలు, అండర్-17లో మూడు బంగారు పతకాలతో కలిపి మొత్తం 9 బంగారు పతకాలు సాధించి విజయఢంకా మోగించారు.అండర్-19 విభాగంలో బంగారు పతకాలు సాధించి ప్రథమస్థానంలో నిలిచిన కీర్తన, యం.జాహ్నవి, కె.మౌనిక, పి.హిమాని, కె.నేత్రావతి, జేఎస్ హేమలత అక్టోబరు 3, 4 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీలకు ఎంపికయ్యారని, అండర్-17 విభాగంలో బంగారు పతకాలు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన ఆర్.చందన, యస్.లక్ష్మీదేవి, యం.మాధవి అక్టోబరు 6, 7 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఒకేసారి 9 బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులను, వారిని తీర్చిదిద్దిన కేజీబీవీ పీఈటీ తరణుమ్ తాజ్‌ను, ఎస్వో రోహిణి, ఉపాధ్యాయులు అభినందించారు.

జడ్పీ పూర్వ సీఈవోకు వీడ్కోలు



గ్లోరియాను సన్మానిస్తున్న జడ్పీ చైర్మన్, సీఈవో తదితరులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 25: జడ్పీ పూర్వ సీఈవో గ్లోరియాకు జడ్పీ చైర్మన్, జడ్పీ సీఈవో, ఎంపీడీవోలు జడ్పీ ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో పలువురు అధికారులు మాట్లాడుతూ ఆమె సేవలను కొనియాడారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై తనదైన ముద్రవేశారన్నారు. కింది స్థాయి ఉద్యోగులతో స్నేహభావంతో ఉండేవారన్నారు. అనంతరం గ్లోరియా మాట్లాడుతూ జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఉద్యోగులు తనకు మంచి సహకారం అందించారన్నారు. చిత్తూరులో పనిచేయడం తనకు ధైర్యాన్నిచ్చిందన్నారు. ఎక్కడైనా పనిచేయగలిగే సామర్థ్యం వచ్చిందన్నారు. జడ్పీ సీఈవో రవి కుమార్‌నాయుడు, చైర్మన్ శ్రీనివాసులు, వైస్‌చైర్మన్ రమ్య, ఎంపీడీవోలు, డీఎల్‌డీవోలు, ఉద్యోగులు కలిసి ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకుడు చెంచురత్నం, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీకి సత్కారం

చిత్తూరు (సెంట్రల్): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీగా పనిచేసి మాతృశాఖకు వెళుతున్న డీఎంకే తులసీకి జిల్లా సమాఖ్య మహిళా సభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం స్థానిక జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో జిల్లా అధ్యక్షురాలు సుకన్య అధ్యక్షతన జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో డీపీఎంలు, ఏపీఎంలు, జిల్లా సమాఖ్య ప్రతినిధులు, మహిళా సంఘం సభ్యులు సత్కరించారు.

ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారం



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 25: ఎమ్మెల్యే గురజాల జగన్ చొరవతో దిగువమాసాపల్లి చెరువు సమస్యను కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిష్కరించారు. చిత్తూరు-తచ్చూర్ హైవే నిర్మాణంలో భాగంగా దిగుమాసాపల్లి చెరువు మొరవ కాలువను హైవే అధికారులు గోడ నిర్మించి మూసివేశారు. గోడ కారణంగా చెరువు నిండితే నీరు వెలుపలికి వెళ్లేందుకు దారి లేక గ్రామంపై వస్తుందని గ్రామస్థులు అనేకమార్లు అధికారులకు విన్నవించారు. తాజాగా వీరు తమ సమస్యలను ఎమ్మెల్యే గురజాల దృష్టికి తీసుకొచ్చారు. ఆయన కలెక్టర్‌తో మాట్లాడారు. దీంతో వెంటనే గోడను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు.

శ్రీవారి ప్రసాదాలు అపవిత్రం చేసిన వారికి పుట్టగతులుండవ్



జగన్, భూమన, వైవీ, ధర్మారెడ్డి చిత్రపటాలకు పాలుపోసి అగరబత్తులు తిప్పుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్

పుంగనూరు, సెప్టెంబరు 25: శ్రీవారి లడ్డూ ప్రసాదాలను అపవిత్రం చేసి ప్రపంచంలోని స్వామి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన వారికి పుట్టగతులుండవని, నిందితులను కఠినంగా శిక్షించాలని పుంగనూరు మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం పుంగనూరు అన్నక్యాంటీన్ ఎదుట మాజీ సీఎం జగన్, టీటీడీ మాజీ చైర్మన్లు భూమన కరుణాకరరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మాజీ ఈవో ధర్మారెడ్డిల చిత్రపటాలకు పూలు వేసి పాలు క్రియలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాలను కల్తీ నెయ్యి, ఆవు, పంది కొవ్వు, వ్యర్థాలతో గత వైసీపీ ప్రభుత్వం మలినం చేసి తీవ్రమైన అపచారానికి పాల్పడిందన్నారు. ఈఘటనకు కారకులైన జగన్మోహన్‌రెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, వైవీ.సుబ్బారెడ్డి, ధర్మారెడ్డిల దిష్టిబొమ్మలను ఆదివారం ఊరేగిస్తూ దహనం చేయడంతో మూడోరోజు వారి ఫొటోలకు పాలు పోసి, అగరబత్తులు తిప్పినట్లు వివరించారు. వీరికి కఠిన శిక్షలు వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో హిందూ పరిరక్షణ సమితి ప్రతినిధి హరిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమలలో భారీ వర్షం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 25: ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు 23 మండలాల్లో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా సోమలలో 56.4, అత్యల్పంగా పుంగనూరులో 1.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా.. కార్వేటినగరంలో 29.2, చిత్తూరు అర్బన్‌లో 25.8, యాదమరిలో 22.4, ఐరాలలో 19.2, సదుంలో 18.4, పులిచెర్లలో 18.0, గంగాధరనెల్లూరులో 11.6, బంగారుపాళ్యంలో 11.4, విజయపురంలో 10.8, గుడిపాలలో 10.2 మి.మీటర్ల వర్షం కురిసింది.

10లోగా సీసీ రోడ్ల పనులు ప్రారంభించాలి

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 25: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుత ఏడాది మంజూరైన 1142 సీసీ రోడ్ల నిర్మాణ పనులు వచ్చేనెల 10వ తేదీలోగా ప్రారంభించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పంచాయతీరాజ్ శాఖ ద్వారా జరుగుతున్న సీసీ రోడ్లు, ఏపీ ల్యాడ్స్ ద్వారా చేపట్టిన పనుల పురోగతిపై ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 10లోగా పనులు ప్రారంభించకపోతే రద్దుచేసి ఇతర మండలాలకు కేటాయిస్తామని చెప్పారు. కొనసాగుతున్న పనులకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశి, ఎస్ఈ శంకర్ నారాయణ, ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల వాయిదా

తిరుపతి, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలను పరిపాలన కారణాల (అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్)వల్ల వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ మౌర్య ప్రకటించారు. కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌కు గడువు తీరిపోయిన నేపథ్యంలో ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, విత్‌డ్రా ప్రక్రియ ముగించుకుని వచ్చే నెల 4న ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుమల పర్యటన, శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఎన్నికలను వాయిదా వేయాలని కూటమి పార్టీ కార్పొరేటర్లతో పాటు పలువురు వైసీపీ కార్పొరేటర్లు మంగళవారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న మరికొంత మంది వైసీపీ కార్పొరేటర్లు బుధవారం నామినేషన్లు వేసేందుకు నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చారు. కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో మేయర్ డాక్టర్ శిరీషతో కలసి కార్యాలయం ముందు కొద్దిసేపు నిరసన తెలిపారు. ఓడిపోతామన్న భయంతోనే ఎన్నికలు నిర్వహించేందుకు అధికార పార్టీ వెనకడుగు వేస్తోందని విమర్శించారు. ఇంతలోనే ఎన్నికలను వాయిదా వేస్తున్నట్టు కార్పొరేటర్లకు వాట్సప్‌లో సవరణ నోటిఫికేషన్ రావడంతో అక్కడ నుంచి వెనుదిరిగారు. కాగా వైసీపీ స్థానిక నాయకత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా ఎన్నికలు వాయిదా వేయాలని కోరిన ఆ పార్టీ కార్పొరేటర్లపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

సనాతన ధర్మాన్ని కాపాడాలి



పుంగనూరులో దీక్ష చేస్తున్న గోరక్ష మహాసంఘ్ జాతీయ కార్యదర్శి అయూబ్‌ఖాన్, బీజేపీ నాయకులు

పుంగనూరు, సెప్టెంబరు 25: భారతదేశంలో సనాతన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అఖిలభారత గోరక్ష మహాసంఘ్ జాతీయ కార్యదర్శి అయూబ్‌ఖాన్ పేర్కొన్నారు. బుధవారం పుంగనూరు ఇందిరాసర్కిల్‌లో తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూప్రసాదాల కల్తీకి నిరసనగా గోవిందనామ స్మరణతో శాంతి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో తిరుమల శ్రీవారి ప్రసాదాలకు ఉన్న పేరు ప్రతిష్ఠలను వైసీపీ నాయకులు అపవిత్రం చేశారని మండిపడ్డారు. దీక్షలో బీజేపీ నాయకులు నరసింహులు, కృష్ణమూర్తి, గంగరాజు, మరంబాబు, రమేశ్, రాజాశెట్టి, విజయశంకర్, ఆదినారాయణ, నానబాల కుమార్ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి: జేసీ



బాధితుడితో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

వి.కోట, సెప్టెంబరు 25: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తామని జేసీ విద్యాధరి అన్నారు. బుధవారం వి.కోట రెవెన్యూ కార్యాలయానికి విచ్చేసిన ఆమె బాధితుల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. తన తండ్రి పేరిట ఉన్న భూమిని ఇటీవల ఫ్రీహోల్డ్ హక్కులు కల్గించారని, తన కుటుంబీకులు అందులో ఉన్న హక్కును తనకు రానివ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఈ సందర్భంగా బాధితురాలు ఫిర్యాదు చేశారు. అనంతరం రెవెన్యూ కార్యాలయానికి భూసమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై వివరణ అడిగి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్వతి, డీటీ బాలాజీ, ఆర్ఐ మోహన్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరుపల్లె హైస్కూల్ ప్రహరీ గోడ ధ్వంసం



ధ్వంసమైన గూడూరుపల్లెలో జడ్పీ హైస్కూల్ ప్రహరీగోడ

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 25: పుంగనూరు మండలం గూడూరుపల్లె జడ్పీ హైస్కూల్ ప్రహరీగోడను కొందరు ధ్వంసం చేసినట్లు బుధవారం హెచ్‌ఎం మహేశ్‌నారాయణ, గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్థుల కథనం మేరకు వివరాలు... గూడూరుపల్లె పాఠశాల కోసం 1966లో 40 సెంట్ల విలువైన భూమిని గ్రామానికి చెందిన ఏనుగుల శాకమ్మ గవర్నర్ పేరిట దానవిక్రయ అగ్రిమెంట్ చేసి బీడీవోకు అందజేశారు. మూడేళ్ల క్రితం పాఠశాల ఆధీనంలో ఉన్న స్థలంలోని 19 సెంట్లు కొందరు ఆక్రమించగా, ఇటీవల కుప్పంలో సీఎం చంద్రబాబును కలిసి పాఠశాల స్థలం కాపాడాలని వినతి చేయగా, మరుసటి రోజే రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు చూపారన్నారు. ఆక్రమణలకు గురికాకుండా ఇనుప స్తంభాల మెష్ ఫెన్సింగ్ వేయగా, ఇటీవల దానిని తొలగించారని చెప్పారు. చందాలు వేసుకుని రూ.2లక్షల వ్యయంతో సిమెంట్ ఇటుకలతో ప్రహరీ గోడ నిర్మించగా, కిరణ్‌కుమార్, అంజప్ప, రామోజీ మరో 10మంది ట్రాక్టర్, ఎక్సకవేటర్‌తో వచ్చి ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో అనేక పర్యాయాలు పాఠశాల స్థలాన్ని కాపాడాలని కలెక్టర్లను వేడుకున్నా ఎవరూ పట్టించుకోకపోగా సీఎం చంద్రబాబు స్పందించారని తెలిపారు. ప్రహరీగోడను ధ్వంసం చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేయాలని కోరుతూ కలెక్టర్, డీఈవో, ఎంఈవో, సీఐలకు ఫిర్యాదు చేశారు.

వృద్ధులకు అన్నదానం

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 25: ప్రవక్త మహ్మద్ జన్మదినం సందర్భంగా వృద్ధాశ్రమంలో బుధవారం మదర్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ సంస్థ ప్రతినిధులు వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అలీఅహ్మద్, ఇమ్రాన్, సైఫుల్లాహ్‌రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో వ్యక్తికి అస్వస్థత

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 25: పాము కాటుతో ఓ వ్యక్తి అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం రామసముద్రం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం చిట్టింవారిపల్లెకు చెందిన గంగులప్ప(60) పొలం పనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో కేకలు వేశారు. చుట్టు పక్కల పొలాల్లో ఉన్న రైతులు సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

దంపతులపై దాడి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 25: పశువులను ఇళ్లముందుకు వదలకండి అన్నందుకు దంపతులపై దాడి చేసిన సంఘటన బుధవారం పుంగనూరు పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు.... పట్టణంలోని దోబీకాలనీలో చంద్రశేఖర్ తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఇంట్లోకెళ్లాడు. అదే ప్రాంతానికి చెందిన రాధాకృష్ణకున్న నాలుగు పశువులు రోడ్డుపై ఉన్న ద్విచక్ర వాహనాన్ని నెట్టడంతో, వాహనం కిందపడి పెట్రోల్ మొత్తం రోడ్డుపాలైంది. దీంతో చంద్రశేఖర్ పశువులను రోడ్డుపైకి వదలడం ఏమిటని ప్రశ్నించడంతో రాధాకృష్ణతోపాటు పద్మావతమ్మ, సాయి, మహేష్‌లు చంద్రశేఖర్, అతడి భార్య కనకమ్మలపై దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. దీంతో గాయపడిన ఇద్దరు పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

మున్సిపల్ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం



మున్సిపల్ కార్మికులకు మందులు అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కుప్పం, సెప్టెంబరు 25: కుప్పం మున్సిపల్ కార్మికులకోసం కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బీఆర్డీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, పీఈఎస్ హాస్పిటల్, శాంతి డెంటల్ క్లినిక్‌ల సౌజన్యంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సుదర్శన్ ఉచిత డెంటల్ కిట్ అందించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పురపాలక సంఘంలోని 140 మంది కార్మికులకు ఉచితంగా వైద్యమందించిన హాస్పిటల్ యాజమాన్యాలకు, లయన్స్ క్లబ్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్డీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, శాంతి డెంటల్ క్లినిక్ డాక్టర్ సుదర్శన్, లయన్స్ క్లబ్ అడ్వైజర్ మహేశ్, అధ్యక్షుడు సోమశేఖర్, సెక్రటరీ సెంథిల్ కుమార్, కోశాధికారి చరణ్, సభ్యులు పీజీ.సెల్వం, శివ తేవర్, మతిన్, బాలాజీ, హర్ష, కౌన్సిలర్ దాము, నాయకులు జాకీర్, సురేశ్ కుమార్, జగన్, స్థానిక నాయకులు ఆర్ఆర్.రవి, కన్నన్, బాబు, ఉమాపతి, పొన్నుస్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరులో పారిశుధ్య చర్యలు

పలమనేరు, సెప్టెంబరు 25: పలమనేరులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పర్యవేక్షణలో చెత్తాచెదారాన్ని తొలగించడం, పిచ్చిమొక్కలను తొలగించే కార్యక్రమాలు చేపట్టారు. బుధవారం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పూలమార్కెట్‌వద్ద మురుగు కాలువల్లో పూడిక తీసే కార్యక్రమం కూడా చేపట్టారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో బుధవారం వార్డు సభలు నిర్వహించి, గత 100 రోజుల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

డిస్క్‌త్రోలో మొదటి స్థానంలో రొంపిచెర్ల విద్యార్థి



చందు

రొంపిచెర్ల, సెప్టెంబరు 25: సదుం గురుకుల పాఠశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి పి.చందు డిస్క్‌త్రోలో మొదటి స్థానం సాధించి విజేతగా నిలిచినట్లు ఆపాఠశాల పీడీ షాదిక్ తెలిపారు. బుధవారం పాఠశాలకు వచ్చిన చందును ఉపాధ్యాయులు అభినందించారు.

బలి బండి ఊరేగింపు

సదుం, సెప్టెంబరు 25: సదుం బట్టువారిపల్లె మిట్టపై నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం బలి బండిపై భీములు వేషధారి ఊరేగాడు. ఇంటింటా బలి బండిలోకి పలు రకాల ఆహార పదార్థాలను అందించారు. కార్యక్రమంలో కంకణదారులు మల్ రెడ్డి దంపతులు, నిర్వాహకులు మనోహర్ రెడ్డి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లెకు ఎస్‌ఐ కావలెను



చౌడేపల్లె, సెప్టెంబర్ 25: చౌడేపల్లె మండలానికి ఒక ఎస్‌ఐ కావలెను అని మండల ప్రజలు కోరుతున్నారు. చౌడేపల్లె పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేసిన రవికుమార్ ఎన్నికల విధుల్లో భాగంగా మదనపల్లెకు బదిలీ అయ్యారు. ఆతరువాత ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి ఎన్నికల విధుల్లో భాగంగా చౌడేపల్లె ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించి, ఎన్నికలు ప్రశాంతంగా జరిపించారు. ఎన్నికల అనంతరం ఆగస్టు 9న ఆయనను కడప జిల్లాకు బదిలీ చేశారు. అప్పటినుంచి చౌడేపల్లెకు ఎస్‌ఐ పోస్టు ఖాళీగానే ఉంది. ఉన్నతాధికారులు స్పందించి ఎస్‌ఐని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ మందులు ముళ్ల పొదల్లో..!

- అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం



రోడ్డు పక్కన ముళ్ల పొదల్లో పడేసిన ట్యాబ్లెట్లు, ఇంజక్షన్లు

శాంతిపురం, సెప్టెంబర్ 25: మండల పరిధిలోని చిన్నారిదొడ్డి పంచాయతీ కొత్తపేట గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన ముళ్ల పొదల్లో ప్రభుత్వం సరఫరా చేసే మందులు రోడ్డు పక్కన కనిపించాయి. ఒక వైపు ఆస్పత్రుల్లో రోగులకు సరిపడే మందులు లేవని ప్రజలు గగ్గోలు పెడుతుంటే ఇలా మందులు ఆరుబయట పడేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శంగా నిలుస్తుంది. బుధవారం కొత్తపేట గ్రామానికి వెళ్లే రోడ్డులో ప్రభుత్వ మాత్రలు, ఇంజక్షన్లు రోడ్డుపక్కన ముళ్ల పొదల్లో పడి ఉండడం పలువురు ప్రయాణికుల కంట పడింది. వాటిని ఫొటోలు తీసి సోషియల్ మీడియాలో వైరల్ చేశారు. పడేసిన మందుల్లో కొన్నింటికి వినియోగం తేది ఉన్నా కూడా వాటిని ఎందుకు పడేశారో అర్థం కావడంలేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రోగులకు ప్రభుత్వం అందిస్తున్న వేలాది రూపాయల విలువైన ట్యాబ్లెట్లు, ఇంజక్షన్లను ఇలా ముళ్ల పొదల్లో పడేయడంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో పడేశారంటే అది ప్రభుత్వ ఆరోగ్య సిబ్బంది పనే అయి ఉంటుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక వేళ వాటికి వినియోగం తేది లేకపోయినా ఇలా పారబోయకూడదని, సంబంధిత అధికారులకు అప్పగించాలని ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఒకరు తెలిపారు. లేదా వారి అనుమతితో వాటిని ఎక్కడైనా కాల్చివేయాలి, పాతిపెట్టాలన్నారు. ఇలా పడివేయడంతో వాటిని ఎవరైనా తీసుకుపోయి ఏదైనా చేస్తే ఎవరికి నష్టం, లేదా వాటి నుండి ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదలకు అందించాల్సిన ప్రభుత్వ మందులు ఇలా పడేయడం మంచిది కాదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ముళ్ల పొదల్లో ఉన్న ప్రభుత్వ మందులపై విచారణ జరిపి, బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మంచి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు





సోమలలో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి - 64పెద్దూరులో ఇది మంచి ప్రభుత్వం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

సోమల, సెప్టెంబరు 25: మంచి ప్రభుత్వంలో సంక్షేమ అభివృద్ధి పరుగులు పెడుతుందని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ప్రజల మన్ననలను పొందుతుందన్నారు. డ్వాక్రా మహిళలకు చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శివకుమార్, ఎంపీడీవో నారాయణ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మదన్‌మోహన్ బాబు, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు, నాగభూషణం రాయల్, హరిప్రసాద్, శ్రీనివాసులు నాయుడు, జనార్థన్, మల్లికార్జున, శివశంకర్, పి.శ్రీనివాసులు, ఉమాపతి నాయుడు, భానుప్రకాశ్ నాయుడు, అక్కినేని, వెంకటసుబ్బయ్య, రమేశ్ నాయుడు, సుబ్బరాయుడు, వేణుగోపాల్ నాయుడు, సుధాకర్, మునిచంద్ర, అష్రఫ్ అలీ అధికారులు పాల్గొన్నారు.

శాంతిపురం: పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చి దిద్దాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ నాయుడు, మాజీ ఎంపీపీ నందిగం ఉదయకుమార్ నాయుడు అన్నారు. మండల పరిధిలోని తుమ్మిశి, నడింపల్లె, చిన్నారిదొడ్డి, 4పెద్దూరు, సి.బండపల్లె గ్రామ సచివాలయాల ఆవరణలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఎంపీడీవో కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇది మంచి ప్రభుత్వం పోస్టర్లు ఆవిష్కరించారు. స్థానిక నేతలు, కార్యకర్తలు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి నేతలను ఘనంగా సన్మానించారు. టీడీపీ నేతలు క్లస్టర్ ఇంచార్జి విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, నేతలు చలపతిస్వామి, పివి నాగరాజు, సర్పంచ్ బాలక్రిష్ణ, ఏఎంసీ నాగరాజు, నారాయణరెడ్డి, ఆర్ఎస్ మణి, చలపతి, గోవిందరాజులు, శ్రీనివాసులురెడ్డి, ప్రకాష్, శ్రీరాములు, మురుగేష్, మునెప్ప, శ్రీనివాసులు, నాగిరెడ్డి, హరినాథరెడ్డి, జయరాం, సుగుణమ్మ, అనుసూయ తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: మండలంలోని లక్కనపల్లెలో జరిగిన గ్రామసభలో టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర కార్యదర్శి రఘుచంద్రగుప్తా, పాతూరునత్తంలో టీడీపీ మండల ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి పాల్గొని, కరపత్రాలను పంపిణీచేశారు. నెల్లిపట్లలో కూడా గ్రామసభ జరిగింది. సచివాలయసిబ్బంది, వీఆర్వోలు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కుప్పం: కుప్పం పురపాలక సంఘం 16వ వార్డులో యూనిట్ ఇన్‌చార్జి హర్షధర్మతేజ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్డు సభలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మోడల్ మున్సిపాలిటీ నిర్మాణం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని చెప్పారు. టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి వీజీ.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం: రామకుప్పం పట్టణంతో బాటూ మణీంద్రం గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం సభలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్‌బాషా, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ చిన్నకృష్ణ పాల్గొని వందరోజుల్లో ప్రభుత్వ అమలు చేసిన పథకాలు గురించి వివరించారు. ఎంపీడీఓ ఈశ్వరన్, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహ, జనసేన మండల అధ్యక్షుడు హరీష్, సర్పంచు మురళీ, నేతలు రామ్మూర్తి, జయశంకర్, మహ్మద్‌రఫీ, రామకృష్ణప్ప, గంట్లరెడ్డి, టీవీరవి, సలాంసాబ్, విజయ్‌కుమార్‌రెడ్డి, సుబ్రీ, ఆదిల్, వెంకటరమణ, అవినాశ్, నవీన్, నిసార్, చాంద్‌బాషా, రామలింగారెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి, సురేష్, నాగరాజు, ఈఓఆర్‌డీ బాబు, తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు నూర్‌బాషా, కరుణాకర్‌నాయుడు, ఈఎం రత్నం, అబ్బాస్ ఇంటింటికెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు. ఈఓపీఆర్‌డీ యుగంధర్, టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సదుం: మండల పరిధిలోని సదుం, నడిగడ్డ గ్రామ పంచాయతీల పరిధిలోని పలు పల్లెల్లో టీడీపీ నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్లను ఇంటి ముందు గోడలకు అతికించారు. టీడీపీ మండల నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సీరన్నగారి పవన్ కుమార్, ఈశ్వరరెడ్డి, మునిరాజన్న, రత్న, మౌలా, పవన్ కుమార్‌రెడ్డి, షఫీ, హరీశ్, అనిల్, రమేశ్, నాగరాజ, దామోదర్‌రెడ్డి, పలువురు కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చౌడేపల్లె: సంక్షేమం అభివృద్ధి సీఎం చంద్రబాబుకే సాధ్యం అని రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి కళ్యాణ్ పేర్కొన్నారు. మండలంలోని బత్తలాపురంలో ప్రజలకు కరపత్రాలను పంచారు. చారాల, కాగతి, పంచాయతీల్లో కూడా టీడీపీ నాయకులు కరపత్రాలను పంచారు.

పుంగనూరు రూరల్: మండలంలోని ఏతూరు పంచాయతీలో టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రసన్నగారిపల్లెలో మండల ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, రాగానిపల్లె పంచాయతీలో టీడీపీ నాయకుడు సుబ్రహ్మణ్యంరాజు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. సమావేశంలో కూటమి నాయకులు చైతన్యరాయల్, ప్రసాద్‌స్వామి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని తూర్పు మొగసాలలో టీడీపీ నాయకుడు ప్రసాద్, రాతి మసీదు ప్రాంతాలల్లో మైనార్టీ నాయకుడు సద్దాంహుస్సేన్ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు.

వి.కోట: మండల పరిధిలోని బోయచిన్నాగనపల్లె, ముదరందొడ్డి, వి.కోట, నెర్నపల్లె, జవ్వునిపల్లె, కొంగాటం పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. కరపత్రాలను ఇంటింటా పంచారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, విశ్వనాథ్, వెంకటేష్, బాబు, కోదండరెడ్డి, జనార్థన్‌రెడ్డి, రాము, రవి, గౌస్‌పీర్, ఇక్బాల్, అయాజ్, ఉమ్మర్ తదితరులు ఉన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు



గంగంగంగవరం మండలంలో సేంద్రియ వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్న డీడీఏ మధుసూదన్ రెడ్డి తదితరులు



శాంతిపురం మండలం ఎంకేపురం వద్ద పూల సాగు పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

గంగవరం, సెప్టెంబరు 25: సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ డీడీఏ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కూర్నిపల్లె, చిన్నూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పొలంలోకి వెళ్లి సేంద్రియ వ్యవసాయ విధానం, ఎరువుల వాడకం, భూసార పరీక్షల ప్రయోజనాలను ప్రయోగాత్మకంగా చేసి చూపించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం 90శాతం సబ్సిడీపై చిన్న, సన్నకారు రైతులకు డ్రిప్ పైపులు, పరికరాలను అందిస్తోందన్నారు. మండల వ్యవసాయ అధికారి హేమలత, పశువైద్యాధికారి కల్పన, ఆర్ఎస్‌కే ఇన్‌చార్జ్ హేమావతి, పంచాయతీ సెక్రటరి బిందు, రైతులు పాల్గొన్నారు.

శాంతిపురం: మండల పరిధిలోని ఎంకేపురంలో వ్యవసాయాధికారి అప్పోజి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పరికరాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎంకేపురం గ్రామ సమీపలోని పంటలను పరిశీలించారు. అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: మండలంలోని అమినిగుంట, చారాల రైతు సేవా కేంద్రాలలో ఏవో జ్యోతి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా వరి, బంతిపూలు, వేరుశనగ పంటల రైతులకు అధిక దిగుబడులు సాధించేందుకు అవగాహన కల్పించారు. రైతులు సిరికల్చర్ సాగు వలన కూడా అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో భూసంరక్షణశాఖ ఏడీఏ మధుసూదన్‌రెడ్డి, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఏఎస్‌వో రామిరెడ్డినాయక్, వీహెచ్‌ఏ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: మండలంలోని పెంగరగుంట, సముద్రపల్లి గ్రామాల్లో ఏవో సంధ్య, సిరికల్చర్ ఏడీ కిషోర్‌నాయక్‌లు పెంగరగుంటవద్ద నాగరాజు అనే రైతు పొలంలోని వరిపైరుకు పొటాషియం నైట్రేట్ ఎరువును పిచికారి చేయించారు. అనంతరం మల్బరీ తోటలను, మల్బరీ షెడ్లను పరిశీలించి రైతులకు మల్బరీ తోటల పెంపకంలోను, పట్టుపురుగులను ఆశించే రోగాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు, భువనేశ్వరి, నక్షత్రయ్య, తిరుమలేసు, టీడీపీ నాయకులు నాగరాజరెడ్డి, జయప్రకాష్, రైతుసంఘం నాయకులు ఉమాపతి నాయుడు, అనుబంధశాఖ అధికారులు ధనుంజయరెడ్డి, తులసినాయక్, భారతి, వెటర్నరీ యూనివర్సిటీ అధికారి ప్రవీణ్, రైతు సేవాకేంద్ర సిబ్బంది భారతి, ప్రకాష్, కార్యదర్శి రామరాజ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

సోమల: వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలతో రైతుకు చేరువకావాలని పుంగనూరు ఏడీఏ శివకుమార్ పేర్కొన్నారు. వల్లిగట్ల పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో సుధాకర్, పశువైద్యాధికారి చందనప్రియ, సుబ్బరాయుడు, రమణయ్య, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి పంచాయతీలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ వేరుశనగ, వరి పంటలను పరిశీలించిన అనంతరం రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: మండలంలోని ఆర్ బెస్తపల్లి, బుషిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి సుధారాణి పంటలకు సోకే తెగులు నివారణ అంశాల గూర్చి రైతులకు వివరించారు. ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరి హరిబాబు, అధికారులు సంపత్, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

సదుం: మండలంలోని చింతపర్తివారిపల్లె, ఊటుపల్లె గ్రామాల్లో పుంగనూరు ఏడీఏ శివకుమార్ రైతులకు పంట సాగు, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ, ఎరువుల వాడకం, ప్రభుత్వ రాయితీపై వ్యవసాయ పరికరాల పంపిణీ, ప్రకృతి సేద్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏవో హరిప్రసాద్, వ్యవసాయ శాఖ మండల సిబ్బంది పాల్గొన్నారు.

వి.కోట: మండల పరిధిలోని కుంభార్లపల్లె, బోడిగుట్టపల్లె పంచాయతీలో ప్రభుత్వం విడుదల చేసిన గోడపత్రికను ఆవిష్కరించి, అక్కడే రైతులతో సభ నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, ఏవో రాజ్యలక్ష్మీ, హెచ్‌వో లక్ష్మీప్రసూన, ఇతర సిబ్బంది, నాయకులు నాగరాజ్, మనోహర్, గణపతి, అక్బర్, నాగా, శ్రీనివాసులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: పంటల సాగులో రైతులు అధికారుల సూచనలు పాటించాలని పొలంబడి జిల్లా పరిశీలకుడు మధుసూధన్‌రెడ్డి కోరారు. మండలంలోని వనమలదిన్నె మేలుందొడ్డి పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. సమావేశంలో ఏడీఏ శివకుమార్‌రాజు, వ్యవసాయ టెక్నికల్ అధికారి ఫయాజ్‌బాషా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన శాఖ అధికారులపై రైతుల ఆగ్రహం

రామకుప్పం: రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ గిడ్డపల్లెలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నా, స్థానిక అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా వారికి అందకుండా పోతున్నాయన్నారు. ఈ క్రాప్ నమోదు చేయకపోవడం వల్ల లక్షలాది రూపాయల ప్రభుత్వ ప్రోత్సాహక ధనాన్ని కోల్పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామన్నారు. బందార్లపల్లె పంచాయతీ పరిధిలో రెండు రైతు సేవా కేంద్రాల్లోని అధికారులను, సిబ్బందిని వెంటనే మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అమృత, నేతలు మాజీ సర్పంచు పెరుమాళ్, నేతలు మునిరెడ్డి, ఆనందరెడ్డి, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి, మురళీమోహన్, గిరి, ప్రకాష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల దోషులను కఠినంగా శిక్షించాలి

పలమనేరు, సెప్టెంబరు 25: తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ తయారీలో జరిగినట్లు చెబుతున్న కల్తీ వ్యవహారంపై ప్రభుత్వం విచారణ జరిపి ఇందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం పలమనేరులో తిరుమల పవిత్రను కాపాడుకుందాం అన్న బ్యానర్‌తో భారీ ర్యాలీ నిర్వహించారు. పలమనేరు పురవీధుల్లో కాషాయ జెండాలు, నల్ల జెండాలు పట్టుకొని పెద్దసంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో హిందూ సంఘాలు, వివిధ రాజకీయపార్టీల నేతలు తరలివచ్చి పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం జాతీయ రహదారిపై మానవహారం ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్, రామచంద్రయాదవ్, పలమనేరు పట్టణ బీజేపీ కన్వీనర్ తాతయ్య నాయుడు, హిందూ సంఘాల నేతలు సిద్దయ్య, సత్యప్రకాష్, ఎంసీరెడ్డి, బీఆర్‌సీ కుమార్, కిరణ్‌కుమార్, వెంకటక్రిష్ణయ్య, పగడాల మధు, తదితరులు పాల్గొన్నారు.



పలమనేరులో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాలు, రాజకీయపార్టీల నేతలు

మైనార్టీలకు టీడీపీలోనే సంక్షేమ పథకాలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 25: మైనార్టీకు తెలుగుదేశంపార్టీలో గుర్తింపుతో పాటు సంక్షేమ పథకాలు అందుతున్నట్లు టీడీపీ మైనార్టీ నాయకుడు సుహేల్‌బాషా పేర్కొన్నారు. బుధవారం స్థానిక అంజుమాన్ కమిటీ ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సీఎం చంద్రబాబు హజ్ యాత్రకు లక్ష రూపాయలు ప్రకటించడం, ఆమామ్ మౌజన్లకు గౌరవ వేతనం, వక్ఫ్ బోర్డు ఆస్తులను సర్వే చేయడానికి ఆదేశాలు జారీ చేయడం అభినందనీయమన్నారు. సమావేశంలో మైనార్టీ నాయకులు మౌలానానూర్, అన్వర్‌బాషా, సద్దాం, చాంద్‌బాషా, అబ్బాస్, నౌషాద్, ఎంఎస్ మస్తాన్, నూరుల్లా, జహీర్, ముబారక్, రఫిక్, ఖాన్‌సాబ్, బాబా, అస్లమ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు పనులు ప్రారంభం

కుప్పం రూరల్, సెప్టెంబరు 25: మండలంలోని పెద్దబంగారునత్తం పంచాయతీలో బుధవారం సర్పంచ్ రోహిత్ రవి ఆధ్వర్యంలో నూతన బోరు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ... మండలంలో, ఈ పంచాయతీలోనూ తాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. స్థానిక పంచాయతీ పార్టీ అధ్యక్షుడు శివకుమార్, వార్డు సభ్యులు, మండల మహిళా ప్రధాన కార్యదర్శి జ్యోతమ్మ, బూత్ ఇన్‌చార్జిలు, చంద్రశేఖర్, సోము, గ్రామస్థులు పాల్గొన్నారు.

మధురమలై కొండలో శాస్త్రోక్తంగా హోమాలు

సోమల, సెప్టెంబరు 24: ఇరికిపెంట పంచాయతీ మధురమలై కొండలో కొలువుదీరిన మల్లేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హోమాదికార్యక్రమాలు, అభిషేకపూజలు నిర్వహించారు. గత 40 రోజులుగా భక్తులు నిత్య పూజలు జరిపారు. సోమల, ఇరికిపెంట, రాశెట్టివారిపల్లె గ్రామాల భక్తులు, చలపతి, సుధాకర్, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, గణేశ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మధ్యప్రదేశ్ అధికారుల అధ్యయనం



సోమల, సెప్టెంబరు 25: మధ్యప్రదేశ్‌కు చెందిన అటల్ భుజల్ యోజన అధికారుల బృందం ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులపై బుధవారం సోమల మండలంలో అధ్యయనం చేశారు. ఈసందర్భంగా నంజంపేట పంచాయతీ సరస్వతీపురంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు రామిశెట్టి మహేశ్ కుమార్ పొలంలో బీజామృతం, ఘన, ద్రవ జీవామృతం తయారీ విధానాలను, పంటలకు వినియోగం అడిగి తెలుసుకున్నారు. అనంతరం కామిరెడ్డివారిపల్లె కవిత పొలంలో 39 రకాల పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ గోపతి వాసు, గురుప్రసాద్, కె.పుష్పా, కల్పన, అధ్యయన బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం

పలమనేరు, సెప్టెంబరు 25: పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో బుధవారం ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి లో పనిచేస్తున్న ఫార్మాసిస్టులు కేక్ కట్‌చేసి అందరికి పంచిపెట్టారు. ఆసుపత్రిలోని ఫార్మాసిస్టులు, వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దీనదయాళ్‌కు బీజేపీ నాయకుల నివాళి


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నేతలు

చిత్తూరు, సెప్టెంబరు 25: జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీనదయాళ్ జయంతి వేడుకలను చిత్తూరు సెంట్రల్ బీజేపీ ఇన్‌చార్జీ షణ్ముగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. స్థానిక గాంధీ కూడలి వద్ద దీనదయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు మాట్లాడుతూ బీజేపీ నిర్మాణంలో దీనదయాల్ పాత్ర కీలకమన్నారు. అనంతరం విద్యార్థులకు భగవద్గీత, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, జనసేన చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ దయారాం, రామభద్ర తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ నిరసన



చిత్తూరు, సెప్టెంబరు 25: సూపర్‌సిక్స్ పథకాల్ని అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద థాళీ బచావ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శివశంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్, నగర కమిటీ అధ్యక్షులు టిక్కీ రాయల్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్లలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు


చేపల మార్కెట్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు, సెప్టెంబరు 25: స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా బుధవారం చర్చి వీధిలోని కూరగాయల, చేపల మార్కెట్లల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ పర్యవేక్షించారు. అక్కడి దుకాణదారులతో ఆయన మాట్లాడారు. వ్యర్థాలను నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ప్రజారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లోకనాథం, నరసింహ, పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు. దర్గా సర్కిల్, సీబీఐ రోడ్డు, కణ్ణన్ కళాశాల మైదానాన్ని కమిషనర్ పరిశీలించారు.

అవగాహనతో ఎయిడ్స్ నిర్మూలన


ఎయిడ్స్ బ్యానర్ ప్రదర్శిస్తున్న పోలీసులు

గుడిపాల, సెప్టెంబరు 25: ముందస్తు జాగ్రత్తతో పూర్తిస్థాయిలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ అరికట్టవచ్చని ఎస్‌ఐ రామ్మోహన్, కోర్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సద్దాం చెప్పారు. బుధవారం పోలీసు స్టేషన్‌లో మీకు తెలుసా అనే కార్యక్రమంలో భాగంగా కోర్ సంస్థ ప్రతినిధులు రాజేశ్వరి, కల్పనలు మాట్లాడుతూ హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు, వైద్యసిబ్బంది జానకి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకోవాలి : ఎంపీ


ఎంపీకి పూల మొక్క అందిస్తున్న విద్యార్థులు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 25: ఉజ్వల భవిష్యత్తు కోసం విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకోవాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సూచించారు. బుధవారం స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ నేటి విద్యార్థులు రేపటి తరానికి మార్గదర్శకులు కావాలని ఆకాంక్షించారు. కార్పొరేట్ విద్యా సంస్థల కంటే ప్రభుత్వ విద్యా సంస్థలే మిన్నని చెప్పారు. సీపీడీసీ కార్యదర్శి రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరిక



చిత్తూరు రూరల్, సెప్టెంబరు 25 : ఆర్టీసీ వైఎస్ఆర్ అసోసియేషన్‌కు చెందిన పలువురు నాయకులు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి పొలిశెట్టి దాము, జీవీ నరసయ్యల సమక్షంలో చేరినట్లు నాయకులు తెలిపారు. బుధవారం బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో నాయకులు అర్జున్, సీవీ మురళీధర్, జిల్లా నాయకులు బాలక్రిష్ణ, సతీష్ చేరారు.

IN THE COURT THE PRL. CIVIL JUDGE (SENIOR DIVISION) OF CHITTOOR
O.E.P.No. 12 OF 2023
O.S.No. 147 OF 2017

Between:
Smt M.Divya
...Decree-Holder/Paintiff
And:
A.B.Subbarama Raju
....Judgement-Debtor/Defendant

AUCTION NOTICE

The schedule mentioned property is going to auction before the above said court on **18-10-2024** in between **10-30 A.M to 5-00 P.M.** The intending bidders may participate in the auction on the said court on the above said date and time.

SCHEDULE

Chittoor District- Chittoor Rural Sub District- G.D.Nellore Mandal - G.D.Nellore Grama Panchyath- G.D.Nellore Revenue Village Accounts- Circar -Dry-Sy.No.415/3 - Extent- Ac.1.01 Cents. In this 2nd line plot No.6- Vacant house site situated within the following boundaries and measurements
East: Site of Venkatamandadi, West:16feet width common Road, North: Plot No.5 belonging to Ramachari, South: Site of Venkatamandadi
Measuring east to West : 40 feet or 12.2 meters, North to South: 30 feet or 9.150 meters
In Total extent 1200 Sq. feet or 133.33 sq. yards.
Value of D.Hr : Rs.6,00,000/-
Value of Court Amin : Rs.9,00,000/-
Value of Sub Registrar : Rs.2,67,000/-
Encumbrance : NIL except mortgage Dt.25-06-2014 in favour of D.Hr

Sd/- **P.G.GOPI,** M.A.LL.B.,
Advocate for Decree-Holder
Place: Chittoor. Date:25-09-2024

నేడు వేపంజేరిలో ఎమ్మెల్యే పర్యటన

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 25: వేపంజేరిలో లక్ష్మీనారాయణ స్వామి ఆలయ కోనేటి వద్ద గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ థామస్ హాజరవుతారని ఇన్‌చార్జి ఎంపీడీవో రాఘవేంద్రరాజు తెలిపారు.

రెవెన్యూ సమస్యలపై విచారణ

వెదురుకుప్పం, సెప్టెంబరు 25: జక్కిదొన రెవెన్యూ లెక్కదాఖలాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలపై బుధవారం డిప్యూటీ కలెక్టర్ గంగాభవానీ విచారించారు. రైతులను, రెవెన్యూ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

వెదురుకుప్పం, సెప్టెంబరు 25: కార్వేటినగరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమన్వయకర్త అధికారి డాక్టర్ ప్రభావతి తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. వైద్య సేవలపై ఆరా తీశారు.

సాంకేతికతతో కేసుల పరిష్కారం


ఈస్ట్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, సెప్టెంబరు 25: సాంకేతికతను వినియోగించి పెండింగ్ కేసుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఎస్పీ మణికంఠ సూచించారు. బుధవారం ఈస్ట్ సర్కిల్, తాలూకా పోలీసు స్టేషన్‌లను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు, స్థితిగతులు, నిందితుల అరెస్టు, దర్యాప్తు తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన సమయంలో కోర్టులో చార్జీషీట్‌లు దాఖలు చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనుమానితులను గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. సర్కిల్ ఆఫీస్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. ఈస్ట్ సర్కిల్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ రమేష్‌బాబు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఐరాల విద్యార్థుల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో హెచ్‌ఎం, పీడీ

ఐరాల, సెప్టెంబరు 25: శ్రీకాకుళంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల హెచ్‌ఎం కోమల బుధవారం ఈ విషయం తెలిపారు. ఎంపికైన రూప,రోహిత్‌లు అక్టోబరు 6 నుంచి కర్నూలులో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులను, పీడీ దేవాను అభినందించారు.

పీఎంశ్రీకి రెండు పాఠశాలల ఎంపిక

నగరి, సెప్టెంబరు25: పీఎంశ్రీకి మండలంలో ఒక పాఠశాల, మున్సిపాలిటీలో ఒక పాఠశాల ఎంపికయ్యాయని పీఎంశ్రీ పాఠశాలల మండల నోడల్ అధికారి నమశ్శివాయ తెలిపారు. ఎంకొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మున్సిపాలిటీ పరిధిలో బాలికల ఉన్నత పాఠశాల ఎంపికయ్యాయన్నారు. ఈ పాఠశాలలకు రూ.20లక్షలు మంజూరు చేస్తారన్నారు. ఈ నిధులను ఆటస్థలం, విజ్ఞానశాస్త్ర ప్రయోగశాలల అభివృద్ధికి వినియోగిస్తామన్నారు.

27న అంగన్‌వాడీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 25: గంగాధరనెల్లూరు, పెనుమూరు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఖాళీలకు ఈనెల 27వ తేదీ ఉదయం 10గంటలకు చిత్తూరు ఆర్‌డీవో ఆఫీస్‌లో ఇంటర్వ్యూలు జరుగుతాయి. సీడీపీవో గుండ్లపల్లె వినతశ్రీ బుధవారం ఈ విషయం తెలిపారు. అదేరోజు పాలసముద్రం మండలంలోని ఖాళీలకు నగరి ఆర్‌డీవో ఆఫీస్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఒరిజినల్ సర్టిఫికేట్లతో పాటు కాల్ లెటర్లను తీసుకుని రావాలన్నారు.

తాగి వేగంగా బైక్ నడిపిన యువకుడికి రిమాండు

వెదురుకుప్పం, సెప్టెంబరు 25: మద్యం తాగి వాహనం నడిపి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన యువకుడికి రిమాండు విధించినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా.. మారేపల్లి కాలనీకి చెందిన జి.పవన్‌కుమార్ మంగళవారం సాయంత్రం పూటుగా తాగి ద్విచక్ర వాహనం నడుపుతూ చవటగుంట వద్ద జనాన్ని భయభ్రాంతులకు గురి చేశాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని పుత్తూరు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట బుధవారం హాజరు పరచగా రిమాండుకు ఆదేశించారన్నారు.

గ్రానైట్ అక్రమ రవాణా లారీల సీజ్

వెదురుకుప్పం, సెప్టెంబరు 25: రికార్డులు లేకుండా గ్రానైట్ అక్రమ రవాణా చేస్తున్న ఐదు లారీలను బుధవారం సీజ్ చేసినట్లు కార్వేటినగరం ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు. సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో సిబ్బంది సురేంద్రనగరం పంచాయతీ పరిధిలో తనిఖీ చేస్తుండగా ఈ గ్రానైట్ లోడు వాహనాలను గుర్తించారన్నారు. ఎటువంటి రికార్డులు లేకుండా ఓవర్‌లోడ్‌తో పళ్లిపట్టు మీదుగా వెళ్తుండగా సీజ్ చేశామన్నారు. లారీలను మైన్స్ అధికారులకు అప్పగించామన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

యాదమరి, సెప్టెంబరు 25: కె.గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం బాలికా సంరక్షణ తదితర అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన జ్యోత్స్న, రోషిణి, భూమిక, నందకిషోర్‌లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు గిరిరాజ, ఉపాధ్యాయులు కనకాచారి, క్రిష్ణారెడ్డి, త్రివేణి, తులసి పాల్గొన్నారు.

ఆర్డీవో పాత భవనంలో చిత్తూరు రూరల్ కార్యాలయం ఏర్పాటు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 25: ఆర్డీవో కార్యాలయం పాత భవనంలో రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఆర్డీవో చిన్నయ్యకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచించారు. బుధవారం ఉదయం భవనాన్ని ఆయన పరిశీలించారు. రెండు రోజుల్లో పెయింటింగ్, మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నేతలు చంద్రప్రకాష్, జయచంద్రనాయుడు, శశికర్‌బాబు, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో నాయకులు



తిరుమలయ్యపల్లెలో ప్రసంగిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల - ఎగువ తవణంపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె, సెప్టెంబరు 25: అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. బుధవారం ఎగువ తవణంపల్లె పంచాయతీ పరిధిలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబునాయుడుదే అన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఎంఈవో హేమలత, జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. **వెదురుకుప్పం:** రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ఇది కచ్చితంగా మంచి ప్రభుత్వమని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. బుధవారం తిరుమలయ్యపల్లెలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వందరోజుల్లో పింఛన్లు పెంచి అందిస్తున్నామన్నారు. అంతకు ముందు కూటమి నాయకులు ఎంపీని సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.హరినాథ్‌బాబు, ఈవోపీఆర్డీ పురుషోత్తం, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ సతీష్‌కుమార్, పార్టీ నాయకులు గురుసాల కిషన్‌చంద్, బట్టే చాణిక్యప్రతాప్, గాలిబాబునాయుడు, పోటుగారి గంగయ్య, రజనీకాంత్,బీఎంరవి, క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి తదితరులు హాజరయ్యారు.**గుడిపాల:** రామభద్రాపురం పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు, హేమాద్రి నాయుడు పాల్గొన్నారు. కొత్తపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఏపీఎం సుధారాణి, టీడీపీ నాయకులు మురళీనాయుడు, చల్లా, సర్పంచ్ పెరీలా, కార్యదర్శులు, సంఘమిత్ర పుష్ప తదితరులు పాల్గొన్నారు. **విజయపురం:** బూచివానత్తం, పన్నూరు, పన్నూరు దళితవాడ, మాధవరం, ఎల్లసముద్రం, ఆమగుంట, ఆలపాకం, ఒరూరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, నాయకులు పరంధామనాయుడు, మురళీ, ముకుందరెడ్డి, రఘునాథరెడ్డి, లక్ష్మీపతి, గోవర్ధన్, శరత్, బాబు, ఉదయ్‌కుమార్‌రెడ్డి, జయరాజ్, పాల్గొన్నారు.

షావుకారుపేటలో బోరు ఏర్పాటుకు ఎమ్మెల్యే హామీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు, సెప్టెంబరు 25: నగరంలోని కణ్ణన్ పాఠశాల ఆవరణలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ నగరంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, నిర్మాణాలతో పాటు ఇతర సంక్షేమ ఫలాలను రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అందేలా కృషి చేస్తామన్నారు. స్థానిక మహిళలతో ఆయన మాట్లాడారు. స్థానికంగా నెలకొన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. షావుకారుపేటలో మూడు నాలుగు రోజుల్లో బోరు డ్రిల్లింగ్ చేయిస్తామని తెలిపారు. కమిషనర్ నరసింహ ప్రసాద్, మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ ఇందు, ఇతర నేతలు, అధికారులు పాల్గొన్నారు.

లాభసాటిగా వ్యవసాయాన్ని మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యం


రైతులతో వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 25: వ్యవసాయరంగాన్ని లాభసాటిగా మార్చలన్నదే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం వివిధ శాఖల అధికారులు, రైతులతో కలిసి పెద్దకాల్వ పంచాయతీ ఎల్లమరాజుపల్లెలో వేరుశనగ పంట పరిశీలించారు. ఈసందర్భంగా రైతుల సందేహాలను నివృత్తి చేశారు. జేడీ మాట్లాడుతూ మంగళ, బుధవారాల్లో అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి అవగాహన కల్పిస్తారన్నారు. జిల్లా వెటర్నరీశాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్, సర్పంచ్ ఏకాంబరం, మండల వ్యవసాయాధికారి భవాని పాల్గొన్నారు. **విజయపురం:** కళియంబాకం, మాధరవం పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో ఏడీఏ సౌభాగ్యలక్ష్మి గ్రామసభ నిర్వహించి రైతులకు సూచనలు ఇచ్చారు. సర్పంచ్‌లు విద్యాభాస్కర్‌రెడ్డి, మమతాశ్రీరాములురెడ్డి, మార్కెట్ కమిటీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.**యాదమరి:** వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులు పాటించి అధికారుల సూచనల మేరకు పంటలు పండిస్తే అధిక దిగుబడులు వస్తాయని జిల్లా వనరుల అధికారి పద్మజ, మండల వ్యవసాయ అధికారి చరిత అన్నారు. బుధవారం మండలంలోని మోర్దానపల్లి, కుక్కలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.సర్పంచ్ మీన, టీడీపీ నేతలు లక్ష్మీపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు. **వెదురుకుప్పం:** కార్వేటినగరం మండలం కొటార్వేడు, కేఎంపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి హేమలత రైతులకు యాజమాన్య పద్ధతులను వివరించారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

బంగారుపాళ్యం, సెప్టెంబరు 25: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో యూటీఎఫ్ స్వర్ణోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ ముందుంటుందన్నారు. బంగారుపాళ్యం మండలంలో మొదటి శాఖ సమావేశం నిర్వహించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘుపతి రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, సరిత, గౌరవాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మండల యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, కృష్ణమూర్తి, రెడ్డెప్ప నాయుడు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 25: వ్యవసాయశాఖ అధికారులు సూచించిన విధంగా సాగుచేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారిసి.వనిత తెలిపారు. బుధవారం కోణంగిపల్లె, చిన్నపోటుచేను గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలపట్ల అవగాహన కల్పించారు. సాగులో పాటించాల్సిన పద్ధతులను వివరించారు. **నింద్ర:** నింద్ర, కొప్పేడు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ఆధునిక సాగు పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. పశుసంవర్ధక శాఖ, మార్కెట్ శాఖ, పట్టు శాఖ అధికారులు, ఏఓ తులసీ పాల్గొన్నారు.

96 శాతం పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 25: జిల్లాలో 96 శాతం గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేయించినట్లు పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్(జేడీ) ఎం.ప్రభాకర్ తెలిపారు. స్థానిక పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేడీ ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులకు సమీకృత దాణా కింద రైతు సేవా కేంద్రాల వారిగా తొమ్మిది మెట్రిక్ టన్నుల దాణా అవసరమని ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు చెప్పారు.ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే జిల్లాలో రైతులకు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వివరించారు.

కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 25: వందరోజుల్లోనే టీడీపీ కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ పెరిగిందని టీడీపీ నేత రుషేంద్రరెడ్డి అన్నారు. పాపిరెడ్డిపల్లె పంచాయతీలో తిమ్మిరెడ్డిపల్లె, తిమ్మిరెడ్డిపల్లె బీసీకాలనీ, గువ్వలకండిగ, పెడకంటిపల్లె, పెడకంటిపల్లె దళితవాడలో నేతలతో కలిసి ఇంటింటికి వెళ్ళి ప్రజలకు కాంట్రాక్టర్ రుషేంద్రరెడ్డి కరపత్రాలను పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ నాయకులు విజయకుమార్‌రెడ్డి, యాగమరెడ్డి, రుషేంద్రరెడ్డి, గిరిబాబురెడ్డి,పాల్గొన్నారు. అలాగే కలిజవేడు పంచాయతీ కె.నాశంపల్లె గ్రామంలో సర్పంచ్ నీలావతి అధ్యక్షతన అధికారులు గ్రామసభ నిర్వహించారు.

ఆంజనేయస్వామి కల్యాణోత్సవం

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 25: స్థానిక టీటీడీ కల్యాణమండపంలో ఈనెల 28న షిర్డి సాయి జన్మదినోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మాలిని గుణశేఖర్‌లు తెలిపారు. సాయిభజన, విష్వేశ్వరపూజ, స్వస్థి పుణ్యాహ వాచనం, సువర్చల సమేత ఆంజనేయస్వామి కల్యాణ హోమం, మంగళహారతి, అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

దుర్గాంబ ఆలయంలో దసరా ఉత్సవాలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 25: గిరింపేట దుర్గాంబ ఆలయంలో అక్టోబరు 3 నుంచి 13 వ తేది వరకు అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వ హిస్తున్నట్లు ఈవో మునిశేఖర్, పాలకమండలి చైర్మన్ దిలీప్‌రెడ్డిలు తెలిపారు. గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వరాలయంలో దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో వివధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వైభవంగా కాలభైరవ అష్టమి పూజలు

నగరి, సెప్టెంబరు25: స్థానిక కాలభైరవస్వామి ఆలయంలో అష్టమి పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి పాలు పెరుగు పంచామృతం, పన్నీరు కొబ్బరినీరు చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

నెలాఖరులోగా సింగిల్ విండోల్లో కంప్యూటరీకరణ పనులు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 25: జిల్లాలో 32 సింగిల్ విండోల్లో చేపట్టిన కంప్యూటరీకరణ పనులు ఈనెలాఖరులోగా పూర్తిచేసి అక్టోబరు 2కు అధికారపూర్వకంగా పనులు ప్రారంభించాలని డీసీవో నాగవర్ధన చెప్పారు. బుధవారం స్థానిక జనతా బజార్‌లోని డీఎల్‌సీవో కార్యాలయంలో ఏపీ సహకార యూనియన్ లిమిటెడ్ నిర్వహించిన రెండురోజుల శిక్షణా తరగతులను ఆయనన ప్రారంభించారు. డీఎల్‌సీవో వనజ, జిల్లా సహకార ఆడిట్ అధికారి బ్రహ్మానందరెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్


ఆస్పత్రి భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

పెనుమూరు, సెప్టెంబరు 25: పెనుమూరు సీహెచ్‌సీలో డాక్టర్లు అందుబాటులో ఉండి సకాలంలో వైద్యసేవలు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన పెనుమూరు సీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గైనిక్ సేవలను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఫార్మసీ రికార్డులను పరిశీలించారు. డాక్టర్లు సంధ్య, గీతాకుమారి సిబ్బంది పాల్గొన్నారు. 50 పడకల ఆసుపత్రి భవన నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామనా కలెక్టర్ చెప్పారు. మండల అధ్యక్షులు రుద్రయ్యనాయుడు, తలారిరెడ్డెప్ప, క్రిష్ణమూర్తినాయుడు, భాస్కర్, అశోక్, నాదముని పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఎమ్మెల్యే

చిత్తూరు, సెప్టెంబరు 25: నియోజకవర్గ ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. 9849907885 నంబరుకు సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

పాఠశాలలో డీఈవో తనిఖీ

పూతలపట్టు, సెప్టెంబరు 25: పి. కొత్తకోట ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజ్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలన్నారు. ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లను ఆదుకోండి

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 25: జిల్లాలోని గ్రీన్ అంబాసిడర్ కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసీ నాయకులు జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడును కోరారు. బుధవారం వారు ఈమేరకు యూనియన్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు నాగరాజు మాట్లాడుతూ కార్మికులను తొలగించవద్దని కోరారు.





కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా బుధవారం క్షీర కలశాలతో ఊరేగింపుగా వస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్,ఈవో గురుప్రసాద్, ఆలయ సిబ్బంది- డప్పు కళాకారుల నృత్యం
వరసిద్ధుని ఉత్సవ విగ్రహాలకు క్షీరాభిషేకం-కలశ ఊరేగింపులో వివిధ దేవతామూర్తుల అవతారాల్లో కళాకారులు